# మెదక్ పట్టణంలో నేడు మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్..



**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** మెదక్ పట్టణానికి శుక్రవారం (జూలై 3) మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నవీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దరెడ్డిపేటలోని 90 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్ల్యూ) నుంచి రాయపహాడ్ 1200 కేఎల్ ఓహెచ్‌బీఆర్‌కు వెళ్లే 1100 మిల్లీమీటర్ల డీఐ ట్రంక్ మెయిన్ పైపులైన్‌లో లీకేజీ ఏర్పడటంతో మరమ్మతు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కారణంగా గురువారం పట్టణానికి నీటి సరఫరా నిలిపివేసినట్లు, దాని ప్రభావంతో శుక్రవారం పట్టణంలోని అన్ని ప్రాంతాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా ఉండదని తెలిపారు. మరమ్మతు పనులు పూర్తయ్యాక యథావిధిగా నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని వెల్లడించారు. ఈ అసౌకర్యాన్ని పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ :లబ్ధిదారులకు స్వయంగా అందజేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్



**వాస్తవ తెలంగాణాడైలీ న్యూస్ /.** కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని 52 కుటుంబాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంర్ఫ్ ) చెక్కులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం పికెట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఎవరైనా అత్యవసర వైద్య సహాయం కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన వారందరికీ త్వరితగతిన సహాయం అందేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# సహకార వారోత్సవాల సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు





**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** సహకార వారోత్సవాల సందర్భంగా మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మెదక్ జిల్లా సహకార సంఘం, కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. "గ్రామీణ ప్రాంత అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర" అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే. హుస్సేన్ తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శుక్రవారం కళాశాలలో జిల్లా సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు జిల్లా సహకార అధికారి ఎస్. పద్మ తెలిపారు. ఈకార్యక్రమంలో వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు బి. శ్రీనివాస్, డాక్టర్ సి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌కు గురైన శ్రీకాంత్‌ను పరామర్శించిన కంఠరెడ్డి తిరుపతిరెడ్డి





**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** మెదక్ మండలం జానకంపల్లి గ్రామానికి చెందిన వనబోయిన. శ్రీకాంత్ గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు పనులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డాడు. ప్రస్తుతం మెదక్ పట్టణంలోని జేమ్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి గురువారం ఆస్పత్రికి చేరుకుని శ్రీకాంత్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, అత్యుత్తమ వైద్య సేవలు అందించి త్వరగా కోలుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం బాధితుడి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని, అవసరమైతే పార్టీ తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వీరి వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్యరెడ్డి, జానకంపల్లి మాజీ సర్పంచ్ సంగమేశ్వర్, చిట్యాల మాజీ సర్పంచ్ వెంకటేశం, బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ నాయకుడు గంజి.నవీన్, నాయకులు సిద్దిరాములు, చంద్రమోహన్ గౌడ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# సింగూరు ప్రాజెక్టు పనులను తరిత్వగతిన పూర్తి చేయండి

- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్
- మరమ్మత్తుల పేరుతో ప్రాజెక్టు అడుగంటి పోయింది
- ఈ ఖరీఫ్ సీజన్లో రైతులకు నీరు అందేనా

**వాస్తవ తెలంగాణ న్యూస్ పుల్కల్ జూలై 2.** ఉమ్మడి మెదక్ జిల్లాలోనే అతిపెద్ద ప్రాజెక్టు అయినా సింగూరు ప్రాజెక్టు అట్టి ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం29.918 టిఎంసిల నీరు ప్రాజెక్టులో ఉండేది అట్టి నీటితో త్రాగడానికి ఇతర ప్రాంతాలతో పాటు పట్టణాలకు సైతం ఇట్టి నీటిని త్రాగడానికి వదిలేవారు గత సంవత్సరం పూ సంవత్సరం గడుస్తున్న ఇప్పటివరకు అట్టి పనులు పూర్తి కాకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు పూర్తి స్థాయిలో ప్రాజెక్టు నిండినప్పటికీ ప్రాజెక్టుకు ప్రమాదం పొంచి ఉంది అనే సాకుతో ప్రాజెక్టులో ఉన్న నీటిని వృధాగా మొత్తం మొత్తం నీటిని దిగువకు వదిలారు ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురువకపోతే ప్రాజెక్టు నిండే అవకాశాలు లేవు కావున ప్రాజెక్టు ఎడమ కాలువ పై వేల మంది



రైతులు కాలువ నీటి కోసం ఎదురుచూస్తున్నారు కావున మంత్రి దామోదర్ రాజనర్సింహ వెంటనే స్పందించి అట్టి పనులను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని వారు అన్నారు లేనియెడల తమ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# యూరియా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలి

## జిల్లాలో యూరియా కొరత లేదు.. క్యూల్లో నిల్చోవద్దు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్ :-** మెదక్ జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. యూరియా కోసం ఎరువుల దుకాణాల వద్ద భారీ క్యూల్లో నిల్చోవద్దని, యూరియా యాప్ ద్వారానే ముందస్తుగా బుక్ చేసుకోవాలని రైతులకు సూచించారు. గురువారం యూరియా సరఫరాపై కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్లు, మార్క్‌ఫెడ్ గోదాముల్లో కలిపి 3,617 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ అందుబాటులో ఉందన్నారు. ప్రతి మండలంలో రెండు నుంచి మూడు డీలర్ కేంద్రాల వద్ద యూరియా నిల్వలు ఉంచి రైతులకు నిరంతరం సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో 53,297 మంది రైతులు 5,706 మెట్రిక్ టన్నుల యూరియాను కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు వదంతులను నమ్మకుండా అవసరమైన మేరకు యూరియా యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని ఎరువులు పొందాలని కలెక్టర్ సూచించారు.

# మాన్సూన్‌పై ముందస్తు కార్యాచరణతో అప్రమత్తంగా ఉండాలి

## సీజనల్, అంటువ్యాధుల నివారణకు సమన్వయంతో చర్యలు
## శానిటేషన్ పకడ్బందీగా అమలు చేయాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్







**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ ప్రతినిధి:–** వర్షాకాలంలో సీజనల్, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ రూపొందించి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజారోగ్య పరిరక్షణకు వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు.గురువారం కలెక్టరేట్ ప్రజావాణి హాలులో వైద్య, ఆరోగ్యశాఖ, జిల్లా పంచాయతీ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో జ్వరాలు, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఈ నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే నాలుగు నెలల పాటు ఫీవర్ సర్వేలు నిర్వహిస్తూ, అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా హైరిస్క్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.గ్రామాలు, పట్టణాల్లో శానిటేషన్ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మురుగు నిల్వలు లేకుండా చర్యలు తీసుకుని, దోమల లార్వా నిర్మూలన చేపట్టాలని సూచించారు. డెంగ్యూపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్ధారణ పరీక్షలు చేసి చికిత్స అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన ప్రాణరక్షక మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జూలై 13న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం విజయవంతానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. జూలై 20న నిర్వహించే మాప్–అప్ కార్యక్రమాన్ని కూడా సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి ప్రజారోగ్య పరిరక్షణకు ముందుచూపుతో పనిచేయాలని సూచించారు.ఈసమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. గణేశ్వర్, డీసీహెచ్ఎస్ డా. శివదయాల్, జిల్లా విద్యాశాఖాధికారి రాజు, డీడబ్ల్యూవో హేమభార్గవి, డీపీవో యాదయ్య, డీపీఆర్వో రామచంద్రరాజు, డిప్యూటీ డీఎంహెచ్వో డా. సృజన, వైద్యాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

# మెదక్‌లో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

## 4.28 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ.. రైతుల ఖాతాల్లో రూ.1005.66 కోట్లు.
## జొన్నల కొనుగోళ్లు కొనసాగుతాయి.. వదంతులు నమ్మొద్దు: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.





**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ ప్రతినిధి:–** మెదక్ జిల్లా చరిత్రలోనే రికార్డు స్థాయిలో వరి ధాన్యం కొనుగోళ్లు నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఈ యాసంగి సీజన్‌లో గత ఏడాదితో పోలిస్తే 1.08 లక్షల మెట్రిక్ టన్నులు అధికంగా దిగుబడులు నమోదయ్యాయని వెల్లడించారు. జిల్లాలో మొత్తం 4,28,361 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, 1,01,752 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.1005.66 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు.గురువారం కలెక్టరేట్‌లో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 8న ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు జూన్ 27తో పూర్తయ్యాయని తెలిపారు. రైతుల సౌకర్యార్థం జిల్లాలో 533 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. పీఏసీఎస్ 305, ఐకేపీ 185, డీసీఎంఎస్ 43 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు నిర్వహించినట్లు వివరించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో మీడియా కీలక పాత్ర పోషించిందని కలెక్టర్ పేర్కొన్నారు. మీడియా సూచనలు, సలహాలను అమలు చేయడం వల్ల కొనుగోళ్లు సజావుగా పూర్తయ్యాయని తెలిపారు.జొన్న రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని సూచించారు. ప్రభుత్వం నాణ్యమైన జొన్నలను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 3,609 మంది రైతుల నుంచి 6,347 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా సివిల్ సప్లై అధికారి పి. నిత్యానందం, సివిల్ సప్లై మేనేజర్ జగదీష్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్‌రావు, డీపీఆర్వో రామచంద్రరాజు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# సాన్స్ స్కిన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి జడ్ పిహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం






**శంకర్‌పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** సాన్స్ స్కిన్ అండ్ హెయిర్ ట్రాన్స్ ప్లేటేషన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శంకర్‌పల్లి జడ్ పిహెచ్ఎస్ బాలికల పాఠశాలలో గురువారం నాల్గవ ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని డాక్టర్ సాయి సింధు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే విద్యార్థినులకు, ఉపాధ్యాయులకు డాక్టర్ ఉచిత ఓపి సేవలు ఉచిత మందులను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య సూచనలు అవసరమైన వారికి వైద్య సలహాలు అందించనున్నట్లు వివరించారు. విద్యార్థులకు ప్రొజెక్టర్ పై చర్మ ఎలర్జీ, వెంట్రుకలు రాలుట, గజ్జి, తామర, దురద, దద్దుర్లు, పులిపిరులు, కురుపులు, పుండ్లు, మొటిమలు, నల్లని, తెల్లని, బొల్లి మచ్చలు, తెల్లని పూత, వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన చర్మ వైద్య సేవలు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. సామాజిక సేవలో భాగంగా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నట్లు డాక్టర్ వెల్లడించింది. పాఠశాల విద్యార్థులు ఈ ఉచిత చర్మ సంబంధమైన ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ అపాయింట్మెంట్ కొరకు మున్సిపల్ పరిధిలోని రామంతాపురం గేటు వద్ద గల సాన్స్ హాస్పిటల్ నెంబర్ (8337000777) ను సంప్రదించాలని పేర్కొన్నారు. డాక్టర్ సాయి సింధు సాన్స్ హాస్పిటల్ తరఫున పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వేదశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వామపక్షాల నిరసనతో దద్దరిల్లిన కలెక్టరేట్లు

పేదల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ గృహ హక్కును పరిరక్షించాలని, నిర్వాసితులైన కుటుంబాలకు వెంటనే న్యాయం చేయాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గుడిసెవాసులు కలెక్టరేట్ల ఎదుట పెద్ద ఎత్తున చేసిన నినాదాలతో కలెక్టర్ కార్యాలయాలు మార్మోగాయి. ధర్నా అనంతరం ఆయా జిల్లా కలెక్టర్లకు వామపక్షాల నేతలు వినతిపత్రాలు అందజేశారు. హనుమకొండ జిల్లా కార్యాలయం వద్ద పోలీసులు, ఆందోళనకారులను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారు.

**కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో స్థలాలు క్రమబద్ధీకరించి హక్కు కల్పించాలి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఇండ్లు లేని వేలాది మంది పేదలు భారీ సంఖ్యలో తరలివచ్చి నాలుగు గంటల పాటు ధర్నా కొనసాగించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎం. సాయిబాబు మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతి ఇంటికి పట్టా.. ప్రతి కుటుంబానికి ఇల్లు అనే నినాదంతో ప్రారంభించిన పోరుబాట, లక్ష్యం నెరవేరేవరకూ ఆగబోదని, పేదలకు గూడు కల్పించేవరకు పాలకులకు కంటిమీద కునుకులేకుండా చేస్తామని స్పష్టం చేశారు. కొత్తగూడెం పట్టణ పరిధిలో జీవో నెంబర్ 76ను తక్షణమే పూర్తిస్థాయిలో అమలు చేసి, అర్హులైన నిరుపేదలందరికీ పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పాల్వంచ పరిధిలోని జీవో నెంబర్లు 444, 999, 817, 727, 410 పరిధిలో దశాబ్దాలుగా నమ్ముకుని ఉన్న స్థలాలను తక్షణమే రెగ్యులరైజ్ చేసి అర్హులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

**హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా, అరెస్టులు**

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట వామపక్షాలు నిర్వహించిన ధర్నా ఉద్రిక్తంగా మారింది. ఉదయం 9 గంటలకే కలెక్టరేట్‌కు చేరుకున్న వామపక్షాల నాయకులు, కార్యకర్తలు.. అధికారులను, సిబ్బందిని కలెక్టరేట్‌లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పేదల ఇండ్ల స్థలాల సాధన కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్ చేశారు. ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులను సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. నాయకుల అరెస్టును అడ్డుకునేందుకు ప్రయత్నించగా వామపక్ష పార్టీల కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట, ఉద్రిక్తత చోటు చేసుకుంది. వరంగల్ జిల్లాలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హనుమకొండ ఏకశిలా పార్కు నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైటాయించి ధర్నా నిర్వహించారు. కలెక్టర్ బయటికి రావాలని, పేదలకు పట్టాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. హైదరాబాద్ లక్డికాపూల్‌లోని హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

# ఆర్ఓఎఫ్ఆర్ భూములకూ పంటరుణాలు



**హైదరాబాద్:వాస్తవ తెలంగాణ** ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలున్న భూములు భూభారతిలో కనిపించేలా మాడ్యూల్ తీసుకురావడంతో పోడు రైతులకు కూడా ఇక నుంచి పంట రుణాలు అందనున్నాయి. పంట నష్టపరిహారం, విద్యుత్ సౌకర్యం, మార్కెట్‌లో పంట సులువుగా అమ్ముకోవడం వంటి ప్రయోజనాలు దక్కనున్నాయి. పోడు చేసుకుంటున్న ఆదివాసీగిరిజన రైతులకు న్యాయం చేయడంలో రైతు కమిషన్ కృషి కీలకమైనది. గతంలో మొక్కజొన్న విత్తనోత్పత్తి చేసి నష్టపోయిన గిరిజన రైతులకు నష్టపరిహారం అందించేలా రైతు కమిషన్ కృషి చేసిన విషయం తెలిసిందే. దేశంలోనే మొదటి సారిగా మల్టీనేషనల్ విత్తన కంపెనీల నుండి దాదాపు 4 కోట్ల వరకు నష్టపరిహారం అందించింది. దాంతో రైతు కమిషన్ పై మరింత నమ్మకం పెంచుకున్న గిరిజన రైతులు మరిన్ని సమస్యలు కమిషన్ దృష్టికి తెచ్చారు. పోడు పట్టాలు ఉన్నప్పటికీ పంట రుణాలు అందట్లేదని రైతు కమిషన్ దృష్టికి ఆదివాసీ గిరిజనులు తీసుకొచ్చారు. దాదాపు 2 లక్షల 30వేల మంది రైతులకు 6 లక్షల 70 వేల ఎకరాలు ఆర్వోఎఫ్ఆర్ చట్టం కిందా పట్టాలున్నాయి. అయితే, గత ప్రభుత్వం వాటిని ధరణి పోర్టల్‌లో చేర్చలేదు. దీంతో వారు పంట రుణాలకు నోచుకోలేదు. ఆ భూముల వివరాలు భూ భారతి పోర్టల్‌లోనూ మొదట కనిపించలేదు. ఈ విషయాలన్ని గతేడాది చివర్లో రైతు కమిషన్ దృష్టికి ఆదివాసీ గిరిజనుల బృందం తీసుకొచ్చింది. దీన్ని రైతు కమిషన్ సీరియస్ గా తీసుకొని.. కమిషన్ కార్యాలయంలో గిరిజన రైతుల సమస్యలపై ఎస్ఎల్‌బీసీ, రెవెన్యూ, ఐటీడీఏ, ఫారెస్ట్, వ్యవసాయ శాఖ అధికారులతోపాటు గిరిజన రైతులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన రైతులు పడుతున్న ఇబ్బందులపై రాష్ట్ర ప్రభుత్వానికి రైతు కమిషన్ నివేదికను అందజేసింది. ఆర్వోఎఫ్ఆర్ చట్టం ప్రకారం పోడు పట్టాలు ఉన్నప్పటికీ.. భూ భారతి పోర్టల్ లో కనిపించకపోవడం కారణంగా.. పంటరుణాలు రావడం లేదని, బోర్లు వేసుకునే అనుమతులు రాకపోవడం, విద్యుత్ సరఫరా కూడా అందట్లేదని ప్రభుత్వానికి వివరించింది. అంతేకాదు పండిన పంట అమ్ముకునే కొనుగోలు కేంద్రాల వద్ద అమ్ముకునే పరిస్థితి లేదని ఎత్తిచూపింది. ఒకవేళ పంట నష్టపోతే.. నష్టపరిహారం కూడా అందకుండా పోతుందనే విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, సభ్యులు విన్నపం మేరకు.. సీఎం రేవంత్ రెడ్డి ఆదివాసీ గిరిజన రైతుల భూములను వివరాలు భూ భారతి పోర్టల్ లో చేర్చేలా చూశారు. ఆర్వోఎఫ్ఆర్ చట్టం ప్రకారం పోడు భూముల వివరాలు భూ భారతి పోర్టల్ లో కనిపించేలా కొత్త మాడ్యూల్ తీసుకొచ్చారు. దీనితో రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల 30 వేల మందికి మేలు జరిగింది. ఇక నుంచి ఆదివాసీ గిరిజన రైతులకు పంట రుణాలు, నష్టపరిహారం, బోర్లు, విద్యుత్ సరఫరా అందనుంది. పండిన పంట కూడా ఈజీగా అమ్ముకోడానికి అవకాశం ఉంటుంది. ఆదివాసీ గిరిజన రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డికి రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, కెవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భూమి సునీల్, గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, భవానీ రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ?రైతు కమిషన్ కృషితోనే విత్తన కంపెనీల పరిహారం, ఇప్పుడు పంట రుణాలు : కొర్స నర్సింహా మూర్తి, ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆదివాసీ గిరిజన రైతుల కోసం రైతు కమిషన్ ఎంతో కృషి చేస్తోంది. మొక్క జొన్న విత్తనోత్పత్తి చేసి నష్టపోతే.. మాకు విత్తన కంపెనీల నుంచి రూ. 4 కోట్ల నష్టపరిహారం ఇప్పించిన ఘనత రైతు కమిషన్‌దే. పాలేం వాగు సాగునీటి ప్రాజెక్టు ద్వారా 10కిలోమీటర్ల వరకు పోడు భూములకు నీటి సరఫరా అందించడానికి రూ.52 లక్షలు ఇప్పించింది. దాని ద్వారా 10వేల 132 ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఒంటిమామిడిలో గిరిజనేతరుల చేతుల్లో ఉన్న 60 ఎకరాలను విడిపించి గిరిజనులకు అందజేయడంలోనూ కమిషన్ కృషి ఉంది. ఇప్పుడు ఆర్వోఎఫ్ఆర్ కింద ఉన్న భూములు భూ భారతిలో కనిపించేలా మాడ్యూల్ తేవడం తో పంటరుణాలు పొందుతున్నాం. బోర్లు, విద్యుత్ సరఫరా కూడా అందుతోంది. ఆదివాసీ గిరిజన రైతులకు న్యాయం జరుగుతున్నది.

# జాతీయ స్థాయికి గీతా స్కూల్ ప్రాజెక్టు


## బిల్డ్‌థాన్-2025లో ప్రతిభ చాటిన తూప్రాన్ విద్యార్థులు

## అభినందించిన అదనపు కలెక్టర్ నగేష్




**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** వికసిత్ భారత్ బిల్డ్‌థాన్-2025' రాష్ట్రస్థాయి పోటీల్లో తూప్రాన్‌లోని గీతా స్కూల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. తెలంగాణ నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన మూడు ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలవడంతో గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ నగేష్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని విద్యార్థుల ప్రతిభ, మేధాశక్తి అభినందనీయమన్నారు. విద్యార్థులు మహతి, కృత్తిక, రాజేష్, ఆశీష్ సంయుక్తంగా రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రతిభకు పదును పెట్టి సృజనాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలని, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుకు రూ.25 వేల నగదు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రాజు, జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానందం, సివిల్ సప్లై మేనేజర్ జగదీశ్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఉపాధ్యాయుడు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో అధికారులు లేకపోవడంతో కాళీ కుర్చీకి డివైఎఫ్ఐఆధ్వర్యంలో వినతి పత్రం



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోనిప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో అధికారులు అందుబాటులో ఉండాలి ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలిడివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ సదాశిపేట తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈరోజు డివైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లడం జరిగింది ఆ క్రమంలో అధికారులు ప్రజావాణిలో మధ్యాహ్నం 12 అవుతున్న ఎవరు అందుబాటులో లేకపోవడంతో కాళీ కూర్చికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా డివైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ సదాశిపేట మండలంలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజుల దోపిడి అరికట్టాలి నిబంధనలు పాటించని ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో టెక్స్ట్ బుక్స్ నోట్ బుక్స్ వంటి అమ్మడం చట్టనిత నేరం వీటిని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది ప్రభుత్వాన్ని విరుద్ధంగా వేళల రూపాలలో ఫీజులు వసూలు చేస్తున్న సంబంధిత అధికారులుపట్టించుకోవడంలేదని ఈ సమస్యలపై అధికారులు దృష్టికి తీసుకెళ్లాలని కోసం ప్రయత్నిస్తే అధికారులు అందుబాటులో లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని ఆయన ఈ సందర్భంగా అన్నారుఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ అభిషేక్ నవీన్ తత్తులు పాల్గొన్నారు.

# హనుమకొండ డీఎంహెచ్ఓ పై ఉద్యోగ సంఘాల కన్నెర్ర

**వరంగల్ :వాస్తవ తెలంగాణ** హనుమకొండ జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్‌డీ రామ్ కుమార్ అనుచితంగా ప్రవర్తించడంతోపాటు వ్యక్తిగత దూషణలకు దిగారని వైద్యారోగ్య శాఖ ఉద్యోగ సంఘాలు, టీఎన్జీవో, టీజీఓ, డాక్టర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఈ మేరకు హనుమకొండ కలెక్టరేట్‌లో జరగాల్సిన 'డాక్టర్స్ డే' కార్యక్రమాన్ని వైద్యులు, సిబ్బంది బహిష్కరించారు. జూన్ 6వ తేదీన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్‌డీ రామ్ కుమార్ ద్వంద్వర్థాలతో మహిళా వైద్యులు, సిబ్బంది పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఘటన చర్చనీయాంశంగా మారింది. సంఘాలు, వైద్యులు, సిబ్బంది మొదట వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే ఎమ్మెల్యే వైద్య, ఆరోగ్య శాఖ మంత్రికి ఫోన్‌లో పరిస్థితిని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయిని కలిసి ఫిర్యాదు చేశారు. గత కొద్దిరోజులుగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వ్యవహరిస్తున్న తీరు, చేస్తున్న వ్యాఖ్యలు ఆవేదనకు గురిచేస్తున్నాయని కలెక్టర్‌కు వివరించారు. ఈ క్రమంలో కలెక్టర్.. మహిళా వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మహిళా డాక్టర్ల ఆవేదనను సావధానంగా కలెక్టర్ ఆలకించారు. వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్‌తో మాట్లాడుతానని కలెక్టర్ హామీ ఇచ్చినట్టు యూనియన్ నేతలు తెలిపారు. డాక్టర్స్ డే కార్యక్రమం ఉంది కదా అని కలెక్టర్ గుర్తు చేయగా డాక్టర్స్ డే కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు వారు చెప్పారు.

**బదిలీ చేయకపోతే నిరవధిక సమ్మె : యాదానాయక్**

ఆశా వర్కర్ల నుంచి అడిషనల్ డీఎంహెచ్ఓ



వరకు వైద్యులు, సిబ్బందిని ద్వంద్వర్థాలతో వ్యక్తిత్వ దూషణలు చేస్తూ ఇబ్బంది పెడుతున్న హనుమకొండ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్‌డీ రామ్‌కుమార్‌ను వెంటనే బదిలీ చేయాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మె చేస్తామని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదానాయక్ హెచ్చరించారు. కారుణ్య నియామకాలపై వెటకారంగా మాట్లాడారన్నారు. కారుణ్య నియామకాల్లో నియమితులైన వారెందరున్నారని అడిగి మరీ 'మీ తల్లిదండ్రులను చంపుకొని ఉద్యోగాలు పొందారు.. మీకు చదువు రాదు' అని కించపరుస్తూ వ్యాఖ్యానించారన్నారు. ఒక జూనియర్ అసిస్టెంట్‌ను 'ఇప్పటి వరకు ఎందుకు పెండ్లి చేసుకోలేదు.. అని ప్రశ్నించి, ఇప్పటి నుంచి నీ పెళ్లాన్ని' అంటూ వ్యాఖ్యానించి అందరి ముందు అవమాన పరిచారన్నారు. జూమ్ మీటింగ్‌లో 9 నెలల గర్భవతిగా ఉన్న ఒక మహిళా డాక్టర్‌నుద్దేశించి ఇంత డల్‌గా ఉంటే, నీ భర్త ఎలా చూసుకుంటడు.. అని వ్యాఖ్యానించారని, దీంతో ఆ డాక్టర్ తీవ్ర మానసిక వ్యధకు గురైందన్నారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. **పనిచేయమన్నందుకే?: డాక్టర్ రామ్‌కుమార్, డీఎంహెచ్ఓ** పని చేయమన్న ందుకే నాపై ఆరోపణలు చేస్తున్నారని డీఎంహెచ్ఓ రామ్‌కుమార్ 'నవతెలంగాణ'కు వివరణ ఇచ్చారు. కారుణ్య కోటాలో నియమితులైన వారిపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించగా, ఆ మాట అన్నది నిజమే కానీ, మీ కుటుంబంలో జరిగిన దుస్సంఘటనతో మీకు ఉద్యోగాలు వచ్చాయని, మేం ఎంతో కష్టపడి చదివితే ఉద్యోగాలు వచ్చాయని, మీ ఉద్యోగాలు నిలుపుకోవాలని అన్నానే తప్పా తప్పుగా మాట్లాడలేదన్నారు. పెద్దమ్మగడ్డ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉద్యోగులు 7 రోజులుగా రాకపోవడంతో మెమోలు ఇచ్చానన్నారు. పనిలో భాగంగానే ప్రశ్నించడం తప్ప ఎవరిపైనా వ్యక్తిగతంగా దూషణలకు దిగలేదని అన్నారు.




# డిజిటల్ బాటలో ఈపీఎఫ్ సేవలు

**ఉద్యోగుల భవిష్యత్తు నిధి స్కీమ్ లో భారీ మార్పులు**
**అన్ని వ్యవహారాలు ఇక డిజిటల్ విధానంలోనే**
**బెసిక్, యాజమాన్య వాటాలో మార్పు లేదు**
**కంపెనీలు తమ వాటా చెల్లించుకుంటే వడ్డీ బాదుడు**
**ఉద్యోగులు తమ అవసరాలకు 75 శాతం సొమ్ము తీసుకునే వెసులు బాటు**
**ఎటువంటి డాక్యుమెంట్ లేకుండానే యూపీఐ ద్వారానే విత్ డ్రా**
**మెడికల్ అవసరాల కోసం ఏడాదికి రెండు సార్లు సొమ్ము తీసుకోవచ్చు**
**పిల్లల చదువు, పెళ్లిళ్లు, ఇంటి నిర్మాణం కోసం సులభ పద్ధతిలో విత్ డ్రా**
**రేపటి నుంచే అందుబాటులోకి రానున్న యాప్, వెబ్ సైట్**




**వాస్తవ తెలంగాణ** ప్రైవేట్, కార్పొరేట్ ఉద్యోగుల భవిష్యత్తు నిధి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు ఆరు దశాబ్దాల కాలం నాటి పాత 'ఈపీఎఫ్ స్కీమ్ 1952' స్థానంలో సరికొత్త సామాజిక భద్రతా కోడ్ కింద 'ఈపీఎఫ్ స్కీమ్ 2026'ను అధికారికంగా నోటిఫై చేసింది. జూన్ 29, 2026 నుంచి ఈ కొత్త నిబంధనలు దేశవ్యాప్తంగా గెజెట్ ప్రచురణతో అమల్లోకి వచ్చాయి. ఇక రేపటి నుంచి కొత్త వెబ్ సైట్ అందుబాటులోకి రానుంది.. ఇకపై ఉద్యోగులు తమ అవసరాల కోసం యూపీఐ ద్వారానే 75 శాతం సొమ్మును తీసుకునే వెసులు బాటును కల్పించింది..

### ఇవిగో కొత్త నిబంధనలు

కొత్త రూల్స్ వచ్చాయి కదా అని మీ జీతం నుంచి కట్ అయ్యే పీఎఫ్ అమౌంట్ ఏమీ మారదు. ఎప్పటిలాగే ఉద్యోగి బెసిక్ శాలరీ నుంచి 12 శాతం, కంపెనీ తరపున మరో 12 శాతం పీఎఫ్ ఖాతాకు జమ అవుతుంది. కొన్ని ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలకు మాత్రం ఇది 10 శాతంగానే కొనసాగుతుంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట వేతన పరిమితి ప్రకారమే ఈ కటింగ్‌లు ఉంటాయి. ఒకవేళ ఉద్యోగులు తమ పీఎఫ్ ఖాతాలో ఎక్కువ డబ్బులు దాచుకోవాలనుకుంటే.. వాలంటరీ ప్రావిడెంట్ ఫండ్ ద్వారా అదనంగా పొదుపు చేసుకునే వెసులుబాటును అలాగే ఉంచారు.

### ఏడాదికి రెండు సార్లే పీఎఫ్ విత్‌డ్రా!

గతంలో అనారోగ్య కారణాల పేరిట పీఎఫ్ ఖాతా నుంచి ఎన్నిసార్లయినా డబ్బులు తీసుకునే వెసులు బాటు ఉండేది.కానీ కొత్త నిబంధనల ప్రకారం.. ఇకపై ఒక ఏడాదిలో గరిష్ఠంగా రెండు సార్లు మాత్రమే పాక్షికంగా డబ్బులు తీసుకోవడానికి అనుమతిస్తారు.ఉదాహరణకు, మీరు ఒక సంవత్సరంలో వేరే ఏదైనా అవసరానికి పీఎఫ్ నుంచి కొంత డబ్బు తీసుకుంటే.. అదే ఏడాదిలో అనారోగ్యం కింద డబ్బులు తీసుకోవడానికి ఇంకా ఒక్కసారి మాత్రమే అవకాశం ఉంటుంది.చదువు, పెళ్లి కోసం:
పిల్లల ఉన్నత చదువులు లేదా పెళ్లిళ్ల కోసం ఉద్యోగి తన మొత్తం సర్వీసు కాలంలో 10 సార్లు పీఎఫ్ డబ్బులు విత్‌డ్రా చేసుకోవచ్చు.

### ఇల్లు, స్థలం కొనుగోలు

సొంత ఇల్లు, ప్లాట్ కొనుగోలు, ఇండ్ల మరమ్మతులు లేదా హోమ్ లోన్ రీపేమెంట్ కోసం గతంలో రెండు సార్లే ఛాన్స్ ఉండేది. కానీ ఇకపై సర్వీసు మొత్తంలో 5 సార్లు ఉపసంహరించుకోవచ్చు.

### 25 శాతం కనీస నిల్వ తప్పనిసరి

కొత్త స్కీమ్ ప్రకారం పీఎఫ్ ఖాతాలో 25 శాతం కనీస నిల్వను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. మీరు డబ్బులు విత్‌డ్రా చేసుకునే రోజు నాటికి.. మీ ఖాతాలో జమ అయిన ఉద్యోగి వాటా, కంపెనీ వాటా, ఆ మొత్తంపై వచ్చిన వడ్డీ.. ఈ మూడింటినీ కలిపి చూసి, అందులో కనీసం 25 శాతం డబ్బును అకౌంట్లోనే ఉంచాల్సి ఉంటుంది. మిగిలిన 75 శాతం లోపే విత్‌డ్రా చేసుకోవాలి. అలాగే, పీఎఫ్ చందాదారుడిగా కనీసం ఒక ఏడాది సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాతే ఈ పాక్షిక ఉపసంహరణలకు అర్హత లభిస్తుంది.

### 20 మంది దాటితే చాలు.. ఈపీఎఫ్‌వో పరిధిలోకి!

ఇకపై 20 మంది లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేసే ఏ సంస్థ అయినా సరే తప్పనిసరిగా ఈపీఎఫ్‌వో పరిధిలోకి వస్తుంది. నిబంధనల ప్రకారం యాజమాన్యం, ఉద్యోగి తమ 12 శాతం వాటాను కరెక్ట్‌గా జమ చేయాలి. కంపెనీ తన వాటాను ఉద్యోగి జీతం నుంచి కట్ చేయడానికి వీల్లేదు. ఒకవేళ అలా చేస్తే కఠిన చర్యలు ఉంటాయి. అయితే, దేశంలో ఏదైనా జాతీయ విపత్తులు సంభవించినప్పుడు మాత్రం.. కేంద్ర ప్రభుత్వం యాజమాన్యం, ఉద్యోగి ఇద్దరి వాటాలను మూడు నెలల పాటు తగ్గించే అధికారాన్ని కలిగి ఉంటుంది.

### కంపెనీలు పీఎఫ్ కట్టకపోతే భారీ వడ్డీ బాదుడు

కంపెనీలు ఉద్యోగుల పీఎఫ్ చందాలను సకాలంలో కట్టకుండా ఆలస్యం చేస్తే ప్రభుత్వం జరిమానాలు విధిస్తుంది. 2 నెలల పాటు చందా కట్టకుంటే బకాయిలపై 0.25 శాతం వడ్డీ చెల్లించాలి. 4 నెలలు ఆలస్యం చేస్తే 0.5 శాతం వడ్డీ పడుతుంది. అంతకంటే ఎక్కువ కాలం పెండింగ్ పెడితే మొత్తం బకాయిలపై 1 శాతం అదనపు భారం పడుతుంది.

### వడ్డీ రేట్ల లెక్కింపు.. ఉద్యోగులకు లాభం!

ఒక ఉద్యోగి తన పీఎఫ్ డబ్బులను పూర్తిగా వెనక్కి తీసుకునే సమయానికి (ఆర్థిక సంవత్సరం ముగిసే లోగా) ప్రభుత్వం ఆ ఏడాదికి సంబంధించిన వడ్డీని అధికారికంగా ఖరారు చేయకపోతే.. దానికి ముందు ఏడాది ఉన్న వడ్డీ రేటు ప్రకారమే లెక్కించి డబ్బులు ఇచ్చేస్తారు. ఒకవేళ ఆ తర్వాత ప్రభుత్వం వడ్డీ రేటును తగ్గిస్తే.. ఆ తగ్గించిన లోటును సంస్థే భరిస్తుంది కానీ, ఉద్యోగికి ఇచ్చిన డబ్బుల నుంచి తిరిగి రికవరీ చేయరు. ఇది ఉద్యోగులకు లాభదాయకమైన నిర్ణయం.

### పెళ్లయ్యాక పాత నామినీ చెల్లదు!

కొత్త రూల్స్ ప్రకారం నామినీ వివరాలు నిబంధనలకు విరుద్ధంగా ఉంటే అవి రద్దవుతాయి. ముఖ్యంగా, ఉద్యోగికి వివాహం కాకముందు ఇచ్చిన నామినీ వివరాలు పెళ్లయిన తర్వాత అస్సలు చెల్లుబాటు కావు. వివాహం జరిగిన వెంటనే భార్య/భర్త లేదా కుటుంబ సభ్యుల వివరాలతో కొత్త నామినీ ఫారమ్‌ను సమర్పించాల్సి ఉంటుంది. ఇక పెన్షన్ లెక్కింపు ఫార్ములాలో పాత పద్ధతినే ఉంచినప్పటికీ, లెక్కించే విధానంలో మాత్రం దామాషా పద్ధతిని తప్పనిసరి చేశారు.

### పాత ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బంది లేదు

ఇప్పటికే పీఎఫ్ అకౌంట్ కలిగి ఉన్న పాత చందాదారులు ఎలాంటి టెన్షన్ పడాల్సిన అవసరం లేదు. పాత 1952 స్కీమ్‌లో ఉన్న ఉద్యోగులందరూ ఆటోమేటిక్‌గా ఈ కొత్త 2026 స్కీమ్‌లోకి మారిపోతారు. మీ పీఎఫ్ బ్యాలెన్స్ కానీ, రిటైర్మెంట్ సేవింగ్స్ కానీ ఎక్కడికీ పోవు, అంతా సురక్షితంగా ఉంటుంది. అలాగే కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారికి కూడా రూల్స్ ప్రకారం పీఎఫ్ అకౌంట్లు ఓపెన్ అవుతాయి. మీ పాత యూనివర్సల్ అకౌంట్ నంబర్ నంబర్ మారదు, ఉద్యోగాలు మారినా అదే నంబర్ శాశ్వతంగా కొనసాగుతుంది.

# వర్షాకాల సమరం

- 20 నుంచి.. వర్షాకాల సమావేశాలు
- నెల రోజుల పాటు ఉభయ సభలు
- ఈ సెషన్ లోనే డీలిమిటేషన్ , మహిళా రిజర్వేషన్ బిల్లులు
- ఉభయ సభలలోనూ మెజార్టీ సాధించిన ఎన్డీఏ కూటమి
- బిల్లులు ఆమోదంపై బీజేపీ ధీమా




**వాస్తవ తెలంగాణ** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 20 నుంచి మొదలు కానున్నాయి. కనీసంగా నెల రోజుల పాటు ఈ సమావేశాలు జరగనున్నాయని చెబుతున్నారు. ఈసారి వర్షాకాల సమావేశాలలో అనేక ఉరుములు మెరుపులు చోటు చేసుకోవడం ఖాయమని అంటున్నారు. ప్రత్యేకించి కీలకమైన రాజ్యాంగ సవరణ బిల్లులు అన్నీ ఈ సమావేశాలలో వరసగా ముందుకు వస్తాయని చెబుతున్నారు. అందులో మొదటిది అయితే డీలిమిటేషన్ బిల్లు. దీనిని సంబంధించిన పూర్వ రంగం సిద్ధం అయింది. ఈ ఏడాది ఏప్రిల్ 16న ఈ బిల్లు ప్రవేశపెడితే 17న జరిగిన ఓటింగ్ లో వీగిపోయింది. దాంతో గత అనుభవాలతో ఈ బిల్లుని ఈసారి మరింత జాగ్రత్తగా ముందుకు తీసుకుని వస్తున్నారు అని చెబుతున్నారు. ఇక డీలిమిటేషన్ బిల్లు ఆమోదానికి అవసరం అయిన 362 మ్యాజిక్ ఫిగర్ కోసం ఎన్డీయే ప్రభుత్వం అవసరమైన కసరత్తు చేసింది అని అంటున్నారు. ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ కి చెందిన 20 మంది ఎంపీలతో పాటు శివసేన ఉద్ధవ్ థాక్రే చీలిక వర్గం ఆరుగురు ఎంపీలతో ఎన్డీయే కూటమికి 324 మంది ఎంపీల మద్దతు సులువుగానే దక్కుతోంది. దానికి మరింత మంది న్యూట్రల్ పార్టీల మద్దతుని దక్కించుకోవాలని కేంద్రం చూస్తోంది. అదే విధంగా డీఎంకే ఇండియా బ్లాక్ నుంచి వేరుపడి దూరం పాటిస్తోంది. నేరుగా ఎన్డీయే డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వకపోయినప్పటికీ సభకు గైర్ హాజరు అయితే 22 మంది డీఎంకే సభ్యుల వల్ల లోక్ సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ మ్యాజిక్ నంబర్ కాస్తా ఏ 350దగ్గరికో వస్తుందని అంటున్నారు. మరికొంత మంది సభ్యులు గైర్ హాజరు అయితే చాలు ఇంకా ఈజీగా బిల్లు ఆమోదం పొందుతుందని అంటున్నారు. ఇక డీలిమిటేషన్ తో పాటుగా మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందితే దేశ రాజకీయ ముఖ చిత్రంలోనే గణనీయంగా మార్పులు వస్తాయని అంటున్నారు. డీలిమిటేషన్ మహిళా బిల్లు విషయంలో ఏప్రిల్ 16న రాద్ధాంతం జరిగింది. కానీ ఇపుడు ఈజీగా ఈ బిల్లు మద్దతు పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# రష్యా ప్రతీకారం

ఉక్రెయిన్‌పై క్షిపణులతో విరుచుకుపడిన పుతిన్ సేన
రాజధాని కీవ్‌పై అటాక్
ఆరుగురు మృతి.. పలువురికి గాయాలు
పలు భవనాలు ధ్వంసం.. భారీగా ఆస్తి నష్టం

**వాస్తవ తెలంగాణ** ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా అర్ధరాత్రి అకస్మాత్తుగా డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతో భారీ దాడులకు తెగబడింది. నగరమంతటా శక్తివంతమైన పేలుళ్లు సంభవించాయి. ఈ దాడులలో ఆరుగురు పౌరులు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. పలు నివాస భవనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాజధానిపై రష్యా పెద్ద ఎత్తున దాడికి సిద్ధమవుతోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ హెచ్చరించిన కొద్ది గంటల్లోనే ఈ దాడి జరిగింది. ఎయిర్‌రైడ్ సైరన్లు మోగడంతో భయాందోళనకు గురైన వేలాది మంది స్థానికులు భూగర్భ మెట్రో స్టేషన్లలో ఆశ్రయం పొందారు. ఈ దాడిలో ఒక తొమ్మిది అంతస్తుల నివాస భవనం పాక్షికంగా కూలిపోగా, శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఒక హోటల్‌తో పాటు పలు నివాస ప్రాంతాలలో భారీగా మంటలు చెలరేగడంతో సహాయక సిబ్బంది రంగంలోకి దిగారు. కీవ్ మేయర్ విటాలీ క్లిట్స్కో తెలిపిన వివరాల ప్రకారం ఈ ప్రమాదంలో ఐదుగురు వైద్య సిబ్బంది గాయపడ్డారు. ఇటీవలి కాలంలో రష్యా ఇంధన మౌలిక సదుపాయాలు, మాస్కోను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ లాంగ్‌రేంజ్ డ్రోన్ దాడులను పెంచిన నేపథ్యంలో రష్యా ఈ ప్రతీకార చర్యకు దిగింది. యుద్ధాన్ని ఆపడానికి పుతిన్‌పై అంతర్జాతీయంగా ఒత్తిడి పెంచాలని ఐర్లాండ్ పర్యటనలోవున్న జెలెన్స్కీ పిలుపునిచ్చారు. మరోవైపు ఉక్రెయిన్‌కు అమెరికా అందిస్తున్న సైనిక సహాయం ప్రాంతీయ, ప్రపంచ స్థిరత్వానికి ఊహించని పరిణామాలకు దారితీస్తుందని రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా ఇప్పటికే హెచ్చరించారు.



# ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ పోటీలలో పాల్గొనండి గీతం విద్యార్థులకు పిలుపు

**వాస్తవ తెలంగాణ** జాతీయ స్థాయి పోటీలలో మరోసారి సత్తాచాటాలని సూచన.భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక ఆవిష్కరణల కార్యక్రమమైన ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 6.0లో చురుకుగా పాల్గొనాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం తన విద్యార్థులు, అధ్యాపకులను కోరింది.అధ్యాపకులను ఉద్దేశించి గీతం వెంచర్ డెవలప్మెంట్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్, ఎంఎస్ఎంఈ ఇంక్యుబేషన్ స్కీమ్ సమన్వయకర్త వికాస్ కుమార్ శ్రీవాస్తవ సూచనలు చేస్తూ, జాతీయ స్థాయి హ్యాకథాన్ కు సమర్పించేందుకు వీలుగా, విద్యార్థుల ఆశాజనకమైన ఆవిష్కరణలు, పరిశోధన ఆలోచనలు, తరగతి గది ప్రాజెక్టులు, ప్రయోగశాల నమూనాలను గుర్తించి, వాటికి మార్గదర్శకత్వం వహించాలని విజ్ఞప్తి చేశారు.ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 6.0 ఎంపికైన ప్రతి ఆలోచనను ఒక ఫంక్షనల్ ప్రోటోటైప్ గా, ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ గా లేదా వాణిజ్యపరంగా లాభదాయకమైన ఉత్పత్తిగా అభివృద్ధి చేయడానికి 15 లక్షల రూపాయల వరకు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఎంఎస్ఎంఈలు, సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించే ఆచరణాత్మక, విస్తరించదగిన, సాంకేతిక ఆధారిత పరిష్కారాలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని వివరించారు.గీతం గతంలో సాధించిన విజయాన్ని ప్రస్తావిస్తూ, ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 5.0 కింద నిధుల కోసం విశ్వవిద్యాలయం నుంచి రెండు ప్రతిపాదనలు ఎంపికయ్యాయని శ్రీవాస్తవ తెలిపారు. కాలిన గాయాలకు పోర్టబుల్ డ్యూయల్-మోడ్ చికిత్సా పరికరమైన ఫ్లెక్సీహీల్ ను అభివృద్ధి చేసినందుకు డాక్టర్ సత్యబ్రత డాష్ కు 10.2 లక్షల రూపాయల ప్రభుత్వ మద్దతు లభించగా, తీరప్రాంత విపత్తుల పర్యవేక్షణ, సుస్థిర మత్స్య పరిశ్రమ కోసం ఏఐ ఆధారిత స్మార్ట్ బాయ్ నెట్ వర్క్ అయిన కోస్ట్-సేఫ్ కోసం చంద్రకాంత మహంతి 11.9 లక్షల రూపాయలు సాధించారన్నారు.ప్రస్తుత ఎడిషన్లో గీతం మరింత గొప్ప విజయాన్ని సాధించగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. వినూత్న ఆలోచనలు ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఇంక్యుబేషన్, మెంటరింగ్ మద్దతుతో తమ భావనలను నిధులు పొందే ప్రాజెక్టులుగా మార్చుకోవాలని ఆయన ప్రోత్సహించారు.ఎంఎస్ఎంఈ ఐడియా హ్యాకథాన్ 6.0 కోసం జూలై 5 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని, ఎంఎస్ఎంఈ ఇన్నోవేషన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకుని, తమ ప్రతిపాదనలను సమర్పించేటప్పుడు గీతంను హోస్ట్ ఇన్ స్టిట్యూట్ గా ఎంచుకోవాలని సూచించారు. ఈ హ్యాకథాన్ పునరుత్పాదక శక్తి, శక్తి సామర్థ్యం, ఆటోమోటివ్ టెక్నాలజీ, ఇండస్ట్రీ 4.0, 5.0, రోబోటిక్స్, ఆటోమేషన్, ఇంకా ఇతర అత్యాధునిక సాంకేతికతల వంటి రంగాలలో ఆలోచనలను ఆహ్వానిస్తుందన్నారు.

ప్రతిపాదిత ఆవిష్కరణలు నూతనంగా, విస్తరించదగినవిగా, సామాజికంగా సంబంధితమైనవిగా ఉండాలని, వాణిజ్య సామర్థ్యంతో పనిచేసే నమూనాలుగా అభివృద్ధి చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉండాలని స్పష్టీకరించారు.హ్యాకథాన్ గత సంచికలో సాధించిన అద్భుతమైన పనితీరును కొనసాగిస్తూనే, భారతదేశ ఆవిష్కరణ, వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థకు గీతం తన సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు వీలుగా, అర్హులైన విద్యార్థులను, పరిశోధన బృందాలు చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించవలసిందిగా అధ్యాపకులను శ్రీవాస్తవ కోరారు.

# సదాశివపేట రోటరీ క్లబ్ సేవలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు



**వాస్తవ తెలంగాణ** సదాశివపేట రోటరీ క్లబ్ ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే. ప్రత్యేకమైన కార్యక్రమాలు చేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకొని అవార్డ్స్ సాధించింది అని క్లబ్ అధ్యక్షులు ఓదెల ప్రభు గుప్త తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలో కలిపి మంచి సేవ కార్యక్రమాలను చేసిన రోటరీ క్లబ్ కి ఇచ్చే అవార్డ్స్ కార్యక్రమం శోభితం 2025-26 హైదరాబాద్ లో జరిగింది . ఇందులో సదాశివపేట రోటరీ క్లబ్ ఒక బంగారు పథకము నాలుగు వెండి పథకాలతో పాటు కాకతీయ రీజన్ లో నూతనంగా ఏర్పడ్డ క్లబ్బుల ప్రదర్శన ఆధారంగా రెండవ స్థానంలో నిలిచింది. ఇంత తక్కువ పీరియడ్ రాష్ట్రస్థాయిలో ఈ విధంగా గుర్తింపు రావడం తమకు గర్వంగా ఉందని సదాశివపేట క్లబ్ అధ్యక్షులు ఓదెల ప్రభు గుప్త తెలిపారు. క్లబ్ ఎలక్టెడ్ కార్యదర్శి మఠం రాచన్న మాట్లాడుతూ ఈ. సంవత్సర కాలంలోచేసిన పనుల గురించి తెలుపుతూ మొదటగా మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించామని అందులో 200 కి పైన స్క్రీనింగ్ జరిగాయని, దానికోసం హైద్రాబాద్ నుండి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తో కుండిన క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం పిసుకువచ్చి అందరికీ స్క్రీనింగ్ చేశామని తెలిపారు. ఇదే కాకుండా హెల్త్ క్యాంప్, కాలేజీ విద్యార్థులు చెడు అలవాట్ల కు బానిసలు కాకుండా ఉండడానికి వారికి అవేర్ నెస్ కోసం నిపుణులతో కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. వీటితో పాటు విద్యార్థులు ఇంటర్ తరువాత ఏ దారిలో వెళ్ళాలి , ఏది చదివితే మంచి ఉపాధి అవకాశాలు వస్తాయి అనే విషయంలో పారిశ్రామిక వేత్తలతో వారికి అవగాహన కల్పించడం జరిగింది. అలాగే ఈ ఎన్ టి స్క్రీనింగ్ కార్యక్రమము 100కుగా విద్యార్థులకు చేయడం జరిగింది. మన ప్రాంతంలో అతి పెద్ద కర్మాగారం అయిన మహీంద్రా కంపెనీ లో ఉద్యోగాల కోసం జాబ్ మేళాని నిర్వహించి సదాశివపేట మండలం లోని కొందరికి ఉపాధి కల్పించడం జరిగింది అని తెలిపారు.వీటితోపాటు సేవా దృక్పథంతో నడపబడుతున్న సరస్వతి శిశు మందిర్ పాఠశాలకి మొయినాబాద్ క్లబ్ వారి సహకారంతో నూతన అంతస్తు నిర్మించి ఇవ్వడం జరిగింది అని తెలిపారు. అలాగే ఈ చిన్న క్లబ్ ఇలాంటి అద్భుత కార్యక్రమాలు. చేయడానికి రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ అధ్యక్షులు ఓడల రాజశేఖర్ గారు ఎంతో కృషి చేశారని వారికి ప్రత్యేక ధన్యవాదాలు ఈ సందర్భంగా తెలియజేశారు. అలాగే క్లబ్ ఇంత విజయవంతంగా నిర్వహించడానికి క్లబ్ సభ్యుల తోడ్పాటు ఎంతో ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అశోక్ కుమార్ భూష గారు కోశాధికారి ముద్ర వేణు,డైరెక్టర్స్ సుధీర్, చిల మల్లన్న, దిడ్డికే వినోద్, మామిడి చంద్రశేఖర్, మామిడి మాలతి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, తంగడపల్లి లక్ష్మణ్ శరత్ చంద్ర, చిలుకూరి నరేందర్, అన్నపూర్ణ బలరాం రాజు . మా చిట్టి ప్రవీణ్, బచ్చు సత్యనారాయణ, మధుసూదన్ వై నాగరాజు గౌడ్ గారు పాల్గొన్నారు.

# జేపీ కాలనీ డివిజన్ బండ్లగూడ కాలనీలో ఎంపీ రఘునందన్ రావు పర్యటన



**వాస్తవ తెలంగాణ** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం జేపీ కాలనీ డివిజన్ బండ్లగూడ కాలనీలో మెదక్ పార్లమెంట్ సభ్యులు ఎం. రఘునందన్ రావు మరియు సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి జిల్లా +ూ రాజశేఖర్ రెడ్డి.కలిసి రైల్వే ట్రాక్కు ఆనుకుని వున్నా ఇండ్లను రైల్వే సిబ్బంది మార్కింగ్ వేయడం జరిగింది దానికి సంబంధిచి రఘునందన్ రావు బండ్లగూడలో పర్యటించి వారికి తగిన న్యాయం చేసేలా చూస్తాం అని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో పటాన్చెరు బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు.

# ఆర్.ఎస్.ఎస్. సేవ ప్రముఖ్ అల్లం శ్రీనివాస్ రెడ్డి ను పరామర్శించిన సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

**వాస్తవ తెలంగాణ** పటాన్ చెరు నియోజకవర్గం భానూర్ గ్రామంలో బీజేపీ సీనియర్ నాయకులు



అల్లం రాజీ రెడ్డి ను మరియు సంగారెడ్డి జిల్లా ాూ సేవ ప్రముఖ్ అల్లం శ్రీనివాస్ రెడ్డి ను పరామర్శించిన సంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోల్కూర్ రాజశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించిన శ్రీ బాలాజీ ఫౌండేషన్ చైర్మన్

## బిజెపి సంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు బలరాం

**వాస్తవ తెలంగాణ** రామచంద్రపురం పట్టణం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీ బాలాజీ



ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత ఏడాది 10వ తరగతి పరీక్షల్లో అత్యున్నత మార్కులు సాధించినటువంటి విద్యార్థులను సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా శ్రీ బాలాజీ ఫౌండేషన్ చైర్మన్ బలరాం గారు మాట్లాడుతూ పదవ తరగతిలో ప్రవేట్ స్కూల్ లకి దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలను రావడం శుభ పరిమాణం అని, ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ప్రతిభ కలిగి ఎక్కువ అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని అందువల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు బాగా చదువుకొని వారి తల్లిదండ్రులకు మరియు మన రామచంద్రపురం పట్టణానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని వారు మాట్లాడటం జరిగింది. విద్యార్థి దశలోనే ఎక్కువగా కష్టపడి చదివితే మీ భవిష్యత్తులో ఎంతో ఉన్నత స్థాయి కి చేరుకుంటారు అని అన్నారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు.రోహిత్ (564), సంగమేశ్వర్(554), రాజేశ్వరి (529)లను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ ్రూ రాథోడ్ , సౌభాగ్య, శ్రీనివాస్ గౌడ్ , తుకారం , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

